క్లుప్తంగా

'రైతుబంధు'కు దరఖాస్తు చేసుకోవాలి

దామెర: మండలంలో నూతనంగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు ఖరీఫ్ పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకొని జూన్ 16 లోపు పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందు కోసం పాట్టాపాస్‌బుక్కు లేదా తహసీల్దార్ డిజిటల్ సైన్ చేసిన ఆఫీస్ కాపీ, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, దరఖాస్తు ఫారం జతచేసి ఏఈఓలకు అందించాలని పేర్కొన్నారు. ఇదివరకు రైతుబంధు పొందుతున్న రైతులు ఎలాంటి జిరాక్స్ కాపీలు అందించాల్సిన అవసరం లేదని, బ్యాంక్ అకౌంట్ మార్చుకోవాలనుకునే రైతులు ఏఈఓలను సంప్రదించి మార్చుకోవచ్చని సూచించారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత

పరకాల: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా నిలుపుదామని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత అన్నారు. 20వ వార్డులోని జర్నలిస్టు కాలనీ 1వ లైన్‌లో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ శనిగరపు రజనీ, మార్క ఉమాదేవి, నల్లెల జ్యోతి, గొర్రె స్రవంతి, లావణ్య, సుజాతరెడ్డి, రాజు, కో ఆప్షన్ సభ్యురాలు ఫాతిమా, యాకుబ్‌అలీ, బీఆర్‌ఎస్ నాయకులు నాగరాజు, సాయితిరుపతిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

గోవధను నియంత్రించాలి

ధర్మసాగర్(వేలేరు): రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలో ఎవరూ గోవధ చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ కోరారు. మేరకు మండలంలోని పీచర గ్రామంలో శ్రీలక్ష్మి గోశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గోవధ జరుగకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కమలేష్ దాస్, గోశాల అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కొనసాగుతున్న మన ఊరు మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మన ఊరు మన బడి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని విమర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు రవి, జయపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటరు సర్వే

శాయంపేట : ఎన్నికల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదుకు మండలంలోని బీఎల్‌ఓలు గురువారం ఇంటింటా సర్వే చేపట్టారు. మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ల వారిగా జాబితా ఆధారంగా ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించారు. ఇంటిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు.. నూతన ఓటర్ల నమోదు, తొలగించే ఓటర్లు ఉన్నారా అనే వివరాలను సేకరించారు. 18 సంవత్సరాలు దాటిన యువతి, యువకులకు ఓటర్‌నమోదు కోసం ఫారం 6, పేరు, వయస్సు, ఇంటి నెంబర్ సవరణకు ఫారం 8, మృతిచెదిన వారి పేరు తొలగించేందుకు ఫారం 7ల్లో నమోదు చేస్తున్నట్లు బీఎల్‌వో రత్నమాల పేర్కొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు: మండలంలోని నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథము సంస్థ ప్రతినిధి జన్ను ప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వతరగతి నుంచి డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18నుంచి 35 ఏళ్ల లోపు యువతకు బైక్ సర్వీస్, కంప్యూటర్ కోచింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు 9676085947 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పరామర్శ

ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నాగనబోయిన రాజేందర్ ఇటీవల మృతిచెందగా స్థానిక సర్పంచ్ సావురే కమల గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబ సభ్యులను అలాగే ఆటో యూనియన్ సభ్యులు పరామర్శించి రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు సురేష్, కృష్ణ, బుచ్చయ్య పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



కమలాపూర్‌లో అమరుల చిత్రటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దామెర: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆత్మ బలిదానాలు చేసుకున్న అమరుల త్యాగాలు మరువలేనివని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. దశాబ్ది వేడకల్లో భాగంగా గురువారం అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అమరవీరుల త్యాగాల ఫలితమన్నారు. వారి త్యాగాలను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరుల ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ రవీందర్, ఎస్సై ముత్యం రాజేందర్, ఎంపీఓ కుసుమ నాగరాజు, వైస్‌ఎంపీపీ జాకిర్‌అలీ, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ, ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పత్తిపాక గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు గొప్పవని ఎంపీపీ రాణి అన్నారు. దశాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో తెలంగాణ అమరుల చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పల్లవి, ఎంపీఓ విమల, పలు గ్రామాల ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరవీరులకు ఘన నివాళులర్పించారు. మండల కేంద్రానికి చెందిన తెలంగాణ అమరవీరులు రాసమల్ల రాజు, బూర రమేష్ కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజిరెడ్డి, కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్, జమున, రాంబాబు, నరేష్, రాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధలో ప్రాణత్యాగం చేసి అమరులకు ఎంపీపీ మార్నేని మధుమతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అదే విధంగా నందనం ఎఫ్‌ఎస్‌సీఎస్ కార్యాలయంలో సొసైటీ వైస్‌చైర్మన్ చందర్‌రావు, డైరక్టర్లు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వైస్‌ఎంపీపీ మోహన్, ఎంపీడీఓ వెంకటరమణ, సీఈఓ సంపత్, కో ఆప్షన్ సభ్యుడు గుంశావలి, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.



శాయంపేట: పత్తిపాకలో



దామెరలో ..



ఆత్మకూరులో..

విద్యుదాఘాతంకు మూగజీవాలు బలి



కమలాపూర్‌లో మృతిచెందిన గేదెలు



పీచర గ్రామంలో మృతిచెందిన గేదె

కమలాపూర్: పచ్చిక మేసేందుకు వెళ్లిన మూగజీవాలను కరెంట్ తీగలు బలి కొన్నాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి వీచిన గాలి దుమారానికి స్థానిక ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఓ తాటి చెట్టు విరిగి విద్యుత్ స్తంభాల వైర్లపై పడటంతో విద్యుత్ వైర్లు తెగి పంట పొలాల్లో పడ్డాయి. ఆ విషయం తెలియని పుల్ల మొగిలి మూడు పాడి గేదెలు మేత కోసం తీసుకెళ్లాడు. అటూవైపుగా వెళ్లిన మూడు పాడి గేదెలు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించానని వారు వచ్చేలోపే పాడి గేదెలు మృతి చెందాయని బోరున విలపించాడు. పాడి గేదెల పెంపకంతోనే తన కుటుంబ జీవనం కొనసాగుతుందని, గేదెల విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.

పీచరలో గేదె..

ధర్మసాగర్(వేలేరు): పచ్చిక మేసేందుకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ తగలి మృత్యువాత పడింది. ఈ సంఘటన మండలంలోని పీచర గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పీచర గ్రామానికి చెందిన కుంద్రు మల్లారెడ్డికు చెందిన పాడి గేదె పచ్చిక మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగిలింది.దీంతో షాక్‌కు గురైన పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే పాడిగేదె మృతిచెందిందని, ఉన్నతాధికారులు స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

బండిసంజయ్‌కు ఘనస్వాగతం



సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పరకాల: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పరకాల చేరుకోగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళహారతులు, పూలదండలతో ఘనస్వాగతం పలికారు. దింతో ఒక్కసారిగా అంగడి జంక్షన్‌లో సందడి నెలకొంది. 5నిమిషాల పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలను కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ సంజయ్ భూపాలపల్లికు వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



నడికూడ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ముస్త్యాలపల్లిలో గురువారం చోటుచేసుకుంది. దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ఈదునూరి పవన్ ద్విచక్ర వాహనంతో శనిగరం నుంచి పరకాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ని ఢీ కొట్టాడు. పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లిలో జరిగే సభకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పవన్‌ను గమనించి అనుచరులతో ప్రథమ చికిత్స చేయించి, ఆటోలో ఆసుపత్రికి పంపించారు.

ప్రతీ ఇంటికి భగీరథ నీరు అందిస్తాం

సాక్షి స్పందన



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

శాయంపేట : మండలంలోని ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తామని మిషన్ భగీరథ ఎస్‌ఈ మల్లేష్ అన్నారు. సాక్షి దినపత్రికలో బుధవారం 'రోడ్డెక్కిన మహిళలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. తాగునీటి సరఫరా నిలచిపోయిన కాలనీలను పరిశీలించారు. డిప్యూటీ ఈఈ చంద్రునాయక్, సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌ల ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తి చేశారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ ఈఈ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

నోట్ పుస్తకాల అందజేత



నోట్ పుస్తకాలు అందజేస్తున్న రామయ్య

ఎల్కతుర్తి: మండలంలోని కేశవాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ పొన్నాల రామయ్య గురువారం నోట్‌బుక్స్, స్టేషనరీ అందించారు. గత పది సంవత్సరాలుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నాల అరుంధతి, పోలు సంపత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐత శ్రీనివాస్, ఉపాధ్యాయులు చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

దామెర: మండలంలోని 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రియాజుద్దీన్ గురువారం ప్రకటనలో కోరారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. స్థానికంగా ఉండే బీఎల్‌ఓలను సంప్రదించి ఫామ్ 6ను సమర్పించాలని పేర్కొన్నారు. అదే విధంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు కోసం ఫామ్ 8, పేరును తొలగించేందుకు ఫామ్ 7ను సమర్పించాలని వెల్లడించారు. లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఎవరి కోసం..?

- అమరధామం వద్ద సీనియర్ అడ్వకేట్ రాజమౌళి ఆందోళన

పరకాల: తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది బలిదానాలు చేశారని, అనేక సంవత్సరాలు పోరాడారని, అలాంటి వారికి గుర్తింపు ఇవ్వకపోతే దశాబ్ది ఉత్సవాలు ఎందుకోసం జరుపుకోవాలని జాతీయ లోక్ అదాలత్ సభ్యుడు, పరకాలకు చెందిన సీనియర్ అడ్వకేట్ ఒంటేరు రాజమౌళి ప్రశ్నించారు. ఈమేరకు పరకాలలోని అమధామం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో న్యాయవాదులకు ఏ మాత్రం గుర్తింపు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లు పోరాటం చేస్తేనే తెలంగాణ రాలేదని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఉద్యమిస్తేనే తెలంగాణ వచ్చిందని వివరించారు.

తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలి



తహసీల్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

నడికూడ: తండ్రి వారసత్వంగా వస్తున్న వ్యవసాయ భూమిని తనకు తెలియకుండా తన సోదరి పేరున తహసీల్దార్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని మండలంలోని వరికోల్ గ్రామానికి చెందిన బత్తుల కుమారస్వామి, రఘుపతిలు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమ తండ్రి నుంచి వారసత్వంగా రావలసిన వ్యవసాయ భూమి 1.20 గుంటలను తమకు తెలియకుండా నడికూడ తహసీల్దార్ వీరగంటి మహేందర్ అక్రమంగా తన సోదరి పేరున ఈ నెల 14వ తేదీన రిజిస్ట్రేషన్ చేశారని, ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

'కేసీఆర్ చేతిలో దోపిడీకి గురవుతున్న రాష్ట్రం'



పరకాల: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పరకాల: ఆత్మబలిదానాలతో ఏర్పడ్డా తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కుటుంబం చేతిలో దోపిడీకి గురవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి విమర్శించారు. టీపీసీసీ పిలుపు మేరకు గురువారం దశాబ్ది ఉత్సవాలను ఆ పార్టీ నాయకులు బహిష్కరించి పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల పోరాటాలను, ఆత్మ బలిదానాలను చూసి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించారని అన్నారు. యావత్ తెలంగాణ ప్రజానికం పోరాటం చేసి రాష్ట్రం సాధిస్తే కల్వకుంట్ల కుటుంబం దోపిడి చేస్తుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంమూర్తి, పరమేష్, భిక్షపతి, సదన్‌కుమార్, చంద్రమౌళి, వేణు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చిన అనంతరం దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో రైతులకు, పేదలు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో రోజుకో కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్‌ఎస్ కొత్త డ్రామాలు మొదలు పెట్టిందని విమర్శించారు. ఉద్యమ సమయంలో నిరుద్యోగులు కళలు కన్నారని, అవి ఆవిరయ్యాయన్నారు. నాయకులు హైదర్, రవి, సాంబయ్య, రవీందర్, రఫీ, సతీష్, భిక్షపతి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కట్టయ్య, నాగరాజు, రాజేందర్, శంకర్, మష్క, కుమారస్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి



పరకాలలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

పరకాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్ విమర్శించారు. మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మోదీ సర్కార్ చేపటుతున్న సంక్షేమ పథకాలను పట్టణంలో గురువారం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఏనాడు తెలంగాణ ఉద్యమంలో కనిపించని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని రాబోయే ఎన్నికలలో ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, మేఘనాథ్, కౌన్సిలర్లు ఆర్‌పీ జయంత్‌లాల్, పూర్ణచారి, పట్టణ ప్రధాన కార్యదర్శులు నిరంజన్, విజయ్, పట్టణ ఉపాధ్యక్షుడు పురుషోత్తం, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రంజిత్ పాల్గొన్నారు.

దామెర: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్లలో గడపగడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు 9 సంవత్సరాల బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, బూత్ అధ్యక్షుడు అనిల్, చిరంజీవి, సుధాకర్, అరుణ్, సాంబరాజు, సుమంత్, నియోజకవర్గ కోకన్వీనర్ రతన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రమణారెడ్డి, కొమురయ్య, సంతోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ కిసాన్‌మోర్చా కన్వీనర్ బుచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 104వ బూత్‌లో గురువారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పాలన గురించి వివరిస్తూ కరపత్రాలు అందించారు. రైతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. మండల కార్యదర్శి పైడి, నాయకులు మల్లేశం, సునీల్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

ఐనవోలు: బీజేపీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని వివిధ పోలింగ్ బూత్‌ల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ సందర్శించారు. నరేంద్ర మోదీ 9 ఏండ్ల పాలనలో దేశం అభ్యున్నతి కొరకు చేపట్టిన పలు సంక్షేమ పథకాలు, విజయాల కరపత్రాలను అందించి ప్రజలకు వివరించారు. జఫర్‌ఘడ్ మండల పార్టీ అధ్యక్షుడు తొటి సురేష్, కోట శ్రవణ్‌గౌడ్, ఇల్లందుల సారయ్య, బుర్ర తిరుపతి గౌడ్, మారేపల్లి వంశీ, విజయ్, రాకేష్, సురేందర్, రమేష్, చింతల రాజు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులను ఏకం చేస్తాం'

కేయూ క్యాంపస్: ఆనాటి తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యార్థి ఉద్యమకారులను ఏకం చేస్తామని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ నిర్ణయించింది. విద్యార్థి ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఓ పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ పరిధిలోని దూరవిద్యా కేంద్రం ఆవరణలో గురువారం రాత్రి సమావేశమై విద్యార్థి ఉద్యమకారుల త్యాగాలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదనే పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో కేయూ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ బాధ్యులు డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ వీరేందర్, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ ఫిరోజ్‌పాషా, డాక్టర్ మంద వీరస్వామి, కొమురయ్య, విజయ్‌కన్నా, గుగులోతు దేవోజీనాయక్, మాచర్ల శరత్‌చంద్ర, సునీల్ నాయక్, సూత్రపు అనిల్, అరూరి రంజిత్, కిరణ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని నిరసన

కేయూ క్యాంపస్: కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద బతుకమ్మలతో గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ కరుణాకర్‌రావు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రణీత, సునీత, రాజేశ్వరి, వందన, శ్రీలత, రమాదేవి, సరిత, రేఖ, సుస్మిత, రుమలా, సాదు రాజేష్, సతీష్, చిర్ర రాజు, వెంకట గోపీనాథ్, ఫిరోజ్‌పాషా, మామిడి లింగయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, జితేందర్, కనకయ్య, బ్రహ్మం, కొమురయ్య, సాంబశివరావు, సిద్ధార్థ పాల్గొన్నారు.

కుక్టా ఆధ్వర్యంలో..

రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు.

కాంగ్రెస్ వివాదాస్పద ఫ్లెక్సీల తొలగింపు



కాజీపేట: సీఎం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కాజీపేట చౌరస్తాలో డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది గురువారం తొలగించారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణ పేరుతో కేసీఆర్ ఫొటోకు పది తలలు పెట్టి ఫ్లెక్సీలను ముద్రించారు. వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ అధికారులతో బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం నెలకొనగా, పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలకు సర్దిచెప్పారు.